# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 29-08-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ఉజ్బెకిస్థాన్‌లో రెండు రోజుల పర్యటన నిమిత్తం ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈరోజు ఆ దేశ రాజధాని తాష్కెంట్‌కు చేరుకున్నారు.
- ప్రపంచ నియమ నిబంధనల రూపకల్పనలో భారత్ కీలక భాగస్వామిగా ఎదుగుతోందని కేంద్ర రక్షణ శాఖా మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు.
- దీర్ఘకాలిక పెట్టుబడులకు భారత్ అత్యుత్తమ వేదికగా నిలుస్తుందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఉద్ఘాటించారు.
- ఒడిశా, బిహార్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ లో రెండురోజుల వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (IMD) హెచ్చరించింది.

= = = = = = = = = = = = = = = = = = =

మధ్య ఆసియా దేశమైన ఉజ్బెకిస్థాన్‌లో రెండు రోజుల పర్యటన నిమిత్తం ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈరోజు సాయంత్రం ఆ దేశ రాజధాని తాష్కెంట్‌కు చేరుకున్నారు. విమానాశ్రయంలో ప్రధాని మోదీకి ఉజ్బెకిస్థాన్ అధ్యక్షుడు షవ్‌కత్ మిర్జియోయేవ్ సాదర స్వాగతం పలికారు. ప్రధాని మోదీ పర్యటన కోసం తాష్కెంట్ నగరం భారతీయ జెండాలు, ప్రత్యేక హోర్డింగ్‌లతో ముస్తాబైంది. మోదీ తాష్కెంట్‌లో పర్యటించడం ఇది నాలుగోసారి కావడం గమనార్హం. ప్రెసిడెన్సియల్ ప్యాలెస్ లో జరగనున్న కీలక సమావేశంలో వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, డిజిటల్ కనెక్టివిటీ, ఇంధనం, విద్య తదితర రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేయడంపై ఇరు దేశాల నేతలు చర్చించనున్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

నేపాల్, టిబెట్ ప్రాంతాల్లో సంభవించిన ఆకస్మిక వరదల్లో మృతుల సంఖ్య 669కి చేరుకోగా 2వేల మందికి పైగా గల్లంతయ్యారు. బాధిత ప్రాంతాల్లో సహాయక చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయి. స్థానిక ప్రజలు, సహాయక సంస్థల భాగస్వామ్యంతో పోలీసులు వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించి సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. వరద ప్రమాదం తర్వాత 287 మంది భారత పౌరులతో సంబంధాలు తెగిపోయాయని, వారంతా గల్లంతైనట్లు భావిస్తున్నామని భారత విదేశీ వ్యవహారాల శాఖ (MEA) వెల్లడించింది. 88 మంది భారతీయులను సురక్షితంగా రక్షించినట్లు విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ సామాజిక మధ్యమం వేదికగా తెలిపారు. చైనా నుండి 120 మంది భారతీయులు ఈరోజు నేపాల్ లోకి ప్రవేశించారని పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

ప్రపంచ కంపెనీలు సరఫరా వ్యవస్థలు, పెట్టుబడుల కేటాయింపులను పునఃసమీక్షించుకుంటున్న ప్రస్తుత తరుణంలో.. భారీ మార్కెట్‌తో పాటు దీర్ఘకాలిక పెట్టుబడులకు భారత్ అత్యుత్తమ వేదికగా నిలుస్తుందని కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ ఉద్ఘాటించారు. అమెరికాలోని చికాగోలో భారత కాన్సులేట్ జనరల్, యూఎస్-ఇండియా స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్ ఫోరం సంయుక్తంగా నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆమె ప్రసంగించారు. దశాబ్ద కాలంగా సాగుతున్న సంస్కరణలు, నిలకడైన ఆర్థిక వృద్ధి, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, ప్రపంచ స్థాయి మౌలిక వసతులే దేశంలో పెట్టుబడుల ఆకర్షణకు ప్రధాన కారణాలని స్పష్టం చేశారు. ఆధార్, యూపీఐ, డిజీ లాకర్ వంటి డిజిటల్ మౌలిక సదుపాయాలతో పాటు సెమీకండక్టర్లు, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో భారత్ తదుపరి వృద్ధిని సాధించనుందని కేంద్రమంత్రి పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

వ్యవసాయ రంగంలో నీటి వినియోగ సామర్థ్యాన్ని మెరుగుపరచడమే లక్ష్యంగా చేపట్టిన Per Drop, More Crop పథకం సత్ఫలితాలనిస్తోందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ఈ ఏడాది జూలై నాటికి దేశవ్యాప్తంగా 115 లక్షల హెక్టార్లకు పైగా సాగు భూమిని సూక్ష్మ సేద్యం పరిధిలోకి తెచ్చినట్లు వెల్లడించింది. క్షేత్ర స్థాయిలో నీటిని సమర్థవంతంగా వినియోగించుకోవడం ద్వారా ఉత్పాదకతను పెంచేందుకు ఈ విధానం దోహదపడుతోంది. 2006లో ప్రారంభమై, ఆ తర్వాత 'ప్రధానమంత్రి కృషి సించాయీ యోజన'లో భాగమైన ఈ పథకం కింద రైతులకు సబ్సిడీని ప్రభుత్వం అందిస్తోంది.

= = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 137వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది. ఈ కార్యక్రమం ఆకాశవాణి, దూరదర్శన్ నెట్‌వర్క్ అంతటా, AIR News వెబ్‌సైట్, News on air మొబైల్ యాప్‌లో ప్రసారమవుతుంది. అలాగే, AIR News, DD News, PMO.. సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖల YouTube ఛానెళ్లలో కూడా ఇది ప్రత్యక్షప్రసారం అవుతుంది. హిందీ ప్రసారం ముగిసిన వెంటనే.. ఆకాశవాణి ఈ కార్యక్రమాన్ని ప్రాంతీయ భాషల్లో ప్రసారం చేస్తుంది.

= = = = = = = = = = = = = = = = = = =

సెర్బియా రాజధాని బెల్‌గ్రేడ్‌లో ఈ నెల 31 నుంచి సెప్టెంబరు 1వ తేదీ వరకు జరగనున్న ఉన్నత స్థాయి సమావేశంలో భారత బృందానికి కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖా మంత్రి కిరణ్ రిజిజు నాయకత్వం వహించనున్నారు. ‘అలీన విధాన వారసత్వం: నేటి ప్రపంచానికి పాఠాలు’ అనే ఇతివృత్తంతో ఈ సమావేశం జరగనుంది. అలీన ఉద్యమం దేశాధినేతల తొలి సదస్సు ప్రారంభమై 65 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = =

భారత్ కేవలం ప్రధాన ఆర్థిక వ్యవస్థగానే కాకుండా.. నాగరికత, సంస్కృతి, సామర్థ్యాలపై విశ్వాసం కలిగిన దేశంగా ఎదిగిందని కేంద్ర రక్షణ శాఖా మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. లఖ్‌నవూలోని బాబాసాహెబ్ భీమ్‌రావ్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం 11వ స్నాతకోత్సవంలో ఆయన ప్రసంగించారు. మన దేశం కేవలం అంతర్జాతీయ నిబంధనలను అనుసరించడమే కాకుండా, ప్రపంచ నియమ నిబంధనల రూపకల్పనలోనూ కీలక భాగస్వామిగా ఎదుగుతోందని తెలిపారు. 34 ఏళ్ల తర్వాత నూతన విద్యావిధానాన్ని తీసుకొచ్చామని, ఈ సంస్కరణలు యువతను విశేషంగా ప్రోత్సహించి... ఆధునిక సాంకేతికతల రూపకల్పనకు బాటలు వేశాయని కేంద్రమంత్రి పేర్కొంటూ...

(వాయిస్…28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

నేపాల్ వరదల నేపథ్యంలో భారత్ అందిస్తున్న సహాయాన్ని ఆ దేశం ప్రశంసించింది. వందలాది మంది ప్రాణాలు కోల్పోయిన ఈ తీవ్ర సంక్షోభ సమయంలో భారత్ అందిస్తున్న సహాయం ఎంతో గొప్పదని, ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎంతో ఉదారంగా వ్యవహరించారని నేపాల్ పేర్కొంది. నేపాల్ ఆర్థిక మంత్రి స్వర్ణీమ్ వాగ్లే

మాట్లాడుతూ.. భవిష్యత్తులో పునర్నిర్మాణ పనులకు భారత్ సహాయం అందిస్తుందని స్పష్టం చేసిందన్నారు. బుధవారం నుంచి ఇప్పటివరకు నేపాల్‌లోని వరద ప్రభావిత ప్రాంతాలకు భారత్ 57.6 టన్నుల సహాయక సామగ్రిని పంపింది.

= = = = = = = = = = = = = = = = = = =

దేశీయ ఈక్విటీ మార్కెట్లు వరుసగా మూడో వారం నష్టాలను చవిచూశాయి. భౌగోళిక రాజకీయ అనిశ్చితులు పెట్టుబడిదారులపై ప్రభావం చూపడంతో సూచీలు క్షీణించాయి. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (BSE) సూచీ సెన్సెక్స్ ఈ వారం 0.35 శాతం క్షీణించి 77,265 వద్ద స్థిరపడింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (NSE) నిఫ్టీ-50 కూడా 0.3 శాతం పడిపోయి 24,176 వద్ద ముగిసింది. అయితే, మిడ్‌క్యాప్ 100, స్మాల్‌క్యాప్ 100 సూచీలు మాత్రం ఈ వారం అర శాతానికి పైగా లాభపడటం విశేషం.

= = = = = = = = = = = = = = = = = = =

బెల్జియం, నెదర్లాండ్స్ వేదికగా జరిగిన ఎఫ్ఐహెచ్ (FIH) మహిళల హాకీ ప్రపంచకప్-2026లో ఐదో స్థానంలో నిలిచిన భారత మహిళా హాకీ జట్టుకు 'హాకీ ఇండియా' 50 లక్షల రూపాయల నగదు బహుమతిని ప్రకటించింది. ప్రపంచ ఐదో ర్యాంకర్ జర్మనీని 3-1 తేడాతో భారత్ ఓడించింది. 1974లో జరిగిన తొలి ప్రపంచకప్‌లో నాలుగో స్థానంలో నిలిచిన భారత జట్టుకు.. మళ్లీ ఇన్నేళ్ల తర్వాత ఇదే అత్యుత్తమ ప్రదర్శన కావడం విశేషం. ఈ టోర్నీ మొత్తంలో కెప్టెన్ సలీమా టెటే నేతృత్వంలోని భారత జట్టు కేవలం ఒక్క మ్యాచ్‌లో మాత్రమే ఓటమి చవిచూసింది.

= = = = = = = = = = = = = = = = = = =

ఒడిశాలో సోమవారం వరకు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (IMD) హెచ్చరించింది. ఈ మేరకు ఆ రాష్ట్రానికి ‘ఆరెంజ్ అలర్ట్’ జారీ చేసింది. రానున్న 2-3 రోజుల్లో బిహార్, గంగా పరీవాహక పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌తో పాటు ఈశాన్య రాష్ట్రాల్లోనూ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = =

మహిళల టీ-20 క్రికెట్ ఆసియా కప్ లో భాగంగా దుబాయ్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం వేదికగా రేపు థాయ్‌లాండ్ తో భారత్ తలపడనుంది. భారత కాలమానం ప్రకారం ఈ మ్యాచ్ రాత్రి 8 గంటల 30 నిమిషాలకు ప్రారంభం కానుంది.

= = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = =